ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు

బైక్‌ను ఢీకొన్న మినీ వ్యాన్ 5లో

అక్కడికక్కడే భార్యాభర్తల దుర్మరణం



వాళ్లల్లో వాళ్లకే..



మొండెపులంకలో రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ఇన్‌చార్జిగా ప్రకటించాం వెళ్లి పనిచేసుకోండని అధిష్ఠానం చెప్పినా క్షేత్రస్థాయిలో వారికి సహకారం అందడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కొత్త ఇన్‌చార్జికి చేయి అందించే పరిస్థితులు లేవు. పి.గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి చూస్తే ఆ విషయం ఇట్టే అర్థమవుతుంది. ఇక్కడ ఎమ్మెల్యేకు కొత్త ఇన్‌చార్జికి పొసగడం లేదు...

ఎవరి దారి వారిదే!

- పి.గన్నవరం ఎమ్మెల్యే, నూతన ఇన్‌చార్జి రూటే వేరు
- ఎవరి కార్యక్రమాలు వారివే
- కొరవడుతున్న సమన్వయం
- ఒకరి కార్యక్రమానికి మరొకరు గైర్హాజరు
- పి.గన్నవరం వైసీపీలో ఎమ్మెల్యే వర్సెస్ ఇన్‌చార్జి

పి.గన్నవరం, జనవరి 27: ఎన్నికల వేళ పి.గన్నవరం నియోజకవర్గం వైసీపీ క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నియోజకవర్గ ముఖ్య నాయకుల తీరు వైసీపీ క్యాడర్‌లోని ద్వితీయ శ్రేణి నాయకులకు మింగుడుపడటం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండకుండా ఇంకా అలకలేంటని ఆ పార్టీ నాయకులే బాహాటంగా అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు అసెంబ్లీ సీట్ల విషయంలో వైసీపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా నియోజకర్గాలలో ఎమ్మెల్యేల స్థానంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ప్రకటన చేసింది. ఈ క్రమంలోనే పి.గన్నవరం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కాదని ఇన్‌చార్జిగా ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును ప్రకటించింది. దీంతో ఎమ్మెల్యే చిట్టిబాబు అధిష్ఠానంపై అలకబూని గత కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు, అధికార కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అంతకుముందు సిట్టింగ్ ఎమ్మెల్యే చిట్టిబాబుకు సీటు కేటాయించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువచ్చిన నేతలు కూడా నెమ్మదిగా విప్పర్తి గూటికి చేరారు. కొంత మంది నాయకులు మినహా మెజార్టీ నాయకులు అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి పనిచేయడానికి సిద్ధమని సంకేతాలిచ్చారు. అయితే అధిష్ఠానం నిర్ణయమే తనకు శిరోధార్యమని చెప్పుకుంటూ వచ్చిన ఎమ్మెల్యే లోలోపల మదనపడుతూ ఎన్నికల వేళ అధిష్ఠానం ఒక నిర్దిష్టమైన హామీ ఇస్తేనే పార్టీ కోసం కష్టపడతానని తన క్యాడర్ వద్ద చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మొండెపులంకలో ప్రభుత్వ కార్యాలయాలు (రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం) ప్రారంభోత్సవ విషయం ఒక రోజు ముందే ఎమ్మెల్యే అధికారిక షెడ్యూల్‌లో ప్రకటించి శనివారం ప్రారంభోత్సవానికి విచ్చేశారు. అయితే ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు గైర్హాజరయ్యారు. చైర్మన్ అయినవిల్లి మండలంలో పలు వురు పార్టీకి చెందిన పాత నాయకులను కలిసే పనిలో బిజీగా గడిపారు. కాగా రిపబ్లిక్‌డే రోజున పి.గన్నవరంలో జరిగిన నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే చిట్టిబాబు కూడా గైర్హాజరయ్యారు. ఇరువురు నేతలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. కాగా అయినవిల్లిలో ఆదివారం జరగనున్న వైసీపీ మండల సమావేశానికి ఇరువురు నేతలు హాజరవుతారా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. ఇలా కీలకమైన ఇద్దరు నేతలు ఎడమొఖం పెడమొఖంగా ఉండడంతో క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇదే కొనసాగితే భవిష్యత్తులో పార్టీకి నష్టమేనని పలువురు బాహాటంగానే చెబుతున్నారు.



అధికార, విపక్ష కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

వైసీపీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ల మధ్య ఉన్న విభేదాలు కౌన్సిల్ సమావేశం సాక్షిగా రచ్చకెక్కాయి. వైసీపీ ఎమ్మెల్సీ వైఖరిని ఆ పార్టీ కౌన్సిలర్లే దుయ్యబట్టారు. అలాగే వైసీపీ కౌన్సిలర్లలో ఉన్న అంతర్గత విభేదాలు సైతం శనివారం జరిగిన అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో తీవ్రస్థాయిలో బహిర్గతమయ్యాయి. అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లిపోయింది. మరోవైపు వైసీపీ కౌన్సిలర్ల వైఖరిపై టీడీపీ, జనసేన కౌన్సిలర్లు సైతం ఆక్షేపణలు వ్యక్తం చేశారు.

రచ్చ..రచ్చ

- వైసీపీ ఎమ్మెల్సీ, కౌన్సిలర్ల మధ్య రచ్చకెక్కిన విభేదాలు
- వైసీపీ కౌన్సిలర్ల అరుపులు, కేకలతో దద్దరిల్లిన సమావేశం
- స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో మంత్రికి సంబంధమేంటి : ప్రశ్నించిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ
- కౌన్సిల్‌కు చైర్మన్ మీరా.. మంత్రా అన్న ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో రెచ్చిపోయిన వైసీపీ కౌన్సిలర్
- ఎటువంటి అనుమతులు లేని లేఅవుట్‌కు ఎంపీ నిధులా?



చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి



ఎమ్మెల్సీ కుడుపూడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

అమలాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అధికార పక్ష నేతల మధ్య యుద్ధంగా మారింది. ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు వైఖరిని సాక్షాత్తూ ఆ పార్టీకి చెందిన పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ సంసాని బులినానితో సహా వైసీపీ కౌన్సిలర్లంతా తప్పుబడుతూ తీవ్ర స్థాయిలో విమర్శలు సంధించారు. తొలుత అజెండాలోని 15వ అంశంలో ముగ్గురు చిరుద్యోగులకు జీతాలు పెంచాలని ఆదేశిస్తూ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఇచ్చిన లేఖ ఆధారంగా నిర్ణయం తీసుకునే అంశం కౌన్సిల్‌లో చర్చకు వచ్చింది. దీనిపై జోక్యం చేసుకున్న వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని వాయిదా వేయాలని పట్టుబట్టారు. అంతేకాకుండా స్టాండింగ్ కౌన్సిల్ కమిటీలను ఇప్పటి వరకు ఎందుకు వేయలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణిని ప్రశ్నించారు. మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకువెళ్లాం, ఆయన నిర్ణయాన్ని బట్టి త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి చైర్‌పర్సన్ మీరా మంత్రా, స్టాండింగ్ కమిటీల్లో మంత్రికి సంబంధం ఏమిటని అనడంతో ఒక్కసారిగా కౌన్సిల్‌లో ఉన్న వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్సీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రికి సంబంధం లేదంటారా అంటూ సంసాని నాని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుపై రెచ్చిపోయారు. అసలు ఎమ్మెల్సీగా మీకు కౌన్సిల్‌లో సలహాలు, సూచనలు ఇవ్వడానికే అర్హత ఉందని ప్రతీ అంశంలోను మీ జోక్యం తగదని నిలదీశారు. సంసాని నానితో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుపై ఎదురు దాడికి దిగారు. స్టాండింగ్ కమిటీలు లేకపోవడం వల్ల మున్సిపాలిటీల్లో లక్షలాది రూపాయల అవినీతి జరుగుతున్నా పట్టించుకునేవారే లేరంటూ వైసీపీ కౌన్సిలర్లపై విరుచుకుపడ్డారు. పనిలో పనిగా జనసేన, టీడీపీకి చెందిన కౌన్సిలర్లు కౌన్సిల్ ఏర్పడి 30 నెలలు గడుస్తున్నా మంత్రి విశ్వరూప్ ఏ ఒక్క సమావేశానికి హాజరు కాలేదని జనసేనకు చెందిన ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి తదితరులు మాట్లాడారు. అయితే 15వ అంశంలో జీతాల పెంపునకు సంబంధించి ముగ్గురు చిరుద్యోగులకు అన్ని అర్హతలు ఉన్నాయని, అధికారులు ముందుగా సభ్యుల దృష్టికి తీసుకురాకపోవం వల్లే ఈ వివాదం తలెత్తిందని మరో వైసీపీ కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అధికారుల తీరును తప్పుబడుతూ మాట్లాడారు.

అనుమతులు లేని లేఅవుట్‌కు ఎంపీ నిధులా?

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో 35 అంశాలతో కూడిన అత్యవసర అజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. వివిధ అంశాలపై చర్చ అనంతరం 31వ అంశం చర్చకు వచ్చినప్పుడు వైసీపీ కౌన్సిలర్లలో ఉన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. సర్వే నంబరు 735/2కు సంబంధించి 10వ వార్డులోని గాంధీనగరంలో ఉన్న లేఅవుట్‌కు సీసీరోడ్డు నిర్మాణ అంశంపై కౌన్సిల్‌లో ఆసక్తికర చర్చ జరిగింది. గాంధీనగర్‌లో డోర్ నం.6-2-12 నుంచి ఎంఎస్‌వీ ప్రసాద్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ చింతా అనురాధ రూ.15లక్షలు మంజూరు చేసినందున రహదారి నిర్మాణానికి ఆమోదం తెలపాలని అధికారులు కౌన్సిల్‌ను కోరారు. దీనిపై తొలుత వైసీపీ కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ మాట్లాడుతూ ఆ లేఅవుట్‌కి ఎటువంటి అనుమతులు లేవని, అలాంటప్పుడు ప్రభుత్వ నిధులతో రోడ్డు ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు. దాంతో ఆ వార్డు కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి జోక్యం చేసుకుని మా వార్డు అభివృద్ధి విషయంలో మీ జోక్యమేమిటని ఎదురుదాడికి దిగారు. ఇద్దరు కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదంతో పట్టణ వైసీపీ అధ్యక్షుడు సంసాని బులినాని జోక్యం చేసుకుని సర్వే నంబరు 735/2లో నాలుగున్నర ఎకరాల జిరాయితీ భూమిలో కామన్‌సైట్ వదలకుండా ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చెల్లించలేదని ఆరోపించారు. లేఅవుట్‌కు సంబంధించి నిబంధనల ప్రకారం 45 సెంట్ల భూమి మున్సిపాలిటీకి దఖలు పడుతుందని, ఇప్పుడు ఉన్న విలువ రూ.15కోట్ల వరకు ఉంటుందని, కన్వర్షన్‌గానీ, సబ్‌డివిజన్ గానీ చేయలేదని, చివరకు ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని సంసాని నాని ఆరోపించారు. అప్పుడు ఆ సైటు అమ్మిన నిర్మలా సిస్టర్స్ మున్సిపాలిటీకి ఆ స్థలంలో డీటీసీపీ లేఅవుట్ కోసం డ్రైన్లు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు వేస్తామని చెప్పారని అందుకు విరుద్ధంగా మున్సిపాలిటీకి ఒక్క రూపాయి కూడా ఆదాయం రాకుండా నాలుగున్నర ఎకరాల్లో భూముల రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోతున్నాయని ఆరోపించారు. దాంతో ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కొల్లాటి దుర్గాభాయితో సహా టీడీపీ, జనసేన కౌన్సిలర్లు జోక్యం చేసుకుని ఆ లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేనప్పుడు ఇదే కౌన్సిల్ గతంలో డ్రైన్, మంచినీటి పైపులైన్లు ఎలా వేశారని ప్రశ్నించారు. అప్పుడు లేని అవరోధాలు ఇప్పుడెందుకని వైసీపీ కౌన్సిలర్ సంసాని నానిపై ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి వివరణ ఇస్తూ ఆ లేఅవుట్ భూములకు ల్యాండ్ కన్వర్షన్ అవ్వలేదని చెప్పడంతో ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను వచ్చే సమావేశం నాటికి తీసుకురావాలని కౌన్సిల్ సూచించింది. అప్పట్లో డ్రైన్, పైపులైను నిర్మాణానికి ఏ ప్రాతిపదికన అనుమతి ఇచ్చారో కూడా కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆరు నెలలకోసారి ట్రాక్టరు టైర్లు పంచర్లు వేయించడానికి సుమారు రూ.10లక్షలు ఖర్చు చేయడం ఏమిటని జనసేన కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి ప్రశ్నించారు. పాత ట్రాక్టర్లు కావడం వల్ల మరమ్మతులకు ఖర్చులు ఎక్కువవుతున్నాయని అధికారులు చెప్పడాన్ని అధికారపక్ష కౌన్సిలర్లు తప్పుబట్టారు. సమావేశంలో కౌన్సిలర్లు పిండి అమరావతి, గండి దేవిహారిక, ఆశెట్టి నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి ఈ-పంట నమోదు పూర్తికావాలి



బెండమూర్లంకలో వరిచేలను పరిశీలిస్తున్న అధికారులు

అల్లవరం, జనవరి 27: ఫిబ్రవరి 15 నాటికి ఈ పంట నమోదు పూర్తికావాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. అల్లవరం మండలం బెండమూర్లంకలో ఈ పంట నమోదులో భాగంగా క్షేత్రస్థాయిలో వరిచేలను పరిశీలించారు. సూపర్‌చెక్‌గా ఈ పంట నమోదు రికార్డులు, సాగు విస్తీర్ణం పూర్తివివరాలను తనిఖీ చేశారు. నీటి ఎద్దడి ఉంటే రైతులు తమ దృషికి తీసుకురావాలని సమస్య రాకుండా నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడతామన్నారు. అల్లవరం మండలంలో 1600 ఎకరాలలో వరినాట్లు పూర్తికాగా 1300 ఎకరాలలో ఈ పంట నమోదు పూర్తైందన్నారు. ఏవో నందెపు వీరవెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, సర్పంచ్ బర్రె సీతారత్నం, వీఆర్వో మెట్ల బాబ్జి, విజయలక్ష్మి, రైతులు గుర్రం నాగభూషణం, ఈలి స్వామి, రేళ్ళ వెంకటరత్నం పాల్గొన్నారు



అభిషేకాలు నిర్వహించుకుంటున్న భక్తులు

మందపల్లి కిటకిట

కొత్తపేట, జనవరి 27: మందపల్లి మందేశ్వర(శనేశ్వర) ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సర్వదర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,05,487 ఒక్కరోజు ఆదాయం లభించగా అన్నప్రసాద విరాళాలు రూ.31,701 లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



జైభీమ్ నినాదాలిస్తున్న హరీష్ బాలయోగి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ, ఎమ్మెల్సీ

ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మంత్రి పినిపే విశ్వరూప్

ముమ్మిడివరం, జనవరి 27: విద్యా ద్వారానే సమాజంలో అసమానతలు తొలగి సమాగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతీ ఒక్కరు విద్యావంతులు కావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పోలమ్మ చెరువుగట్టున నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శిలా విగ్రహాన్ని మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం సుమారు రూ.కోటితో నిర్మించిన అంబేడ్కర్ కన్వెన్షన్ హాలును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. భారతదేశానికి దశాదిశా నిర్దేశించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. విజయవాడ నడిబొడ్డులో సీఎం జగన్ ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనాతవరంలోని పీవీ రావు ఘాట్ నిర్మాణానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ యువత మహనీయుల విగ్రహాల ఏర్పాటుకే పరిమితం కాకుండా వారి ఆశయ సాధనలో ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కరిజాన్ని అంతా అర్థం చేసుకుని ఆ బాటలో పయనించడం ద్వారానే సమ సమాజస్థాపన సాధ్యమవుతుందన్నారు. తాను పదవిలో ఉన్నా లేకపోయినా ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైసీపీ నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, కాశి బాలమునికుమారి, కుడుపూడి శివన్నారాయణ, పెయ్యల చిట్టిబాబు, నల్లా నరసింహమూర్తి, కుడుపూడి శంకరరావు, ముదునూరి సతీష్‌రాజు, నేల కిశోర్‌బాబు, గన్నవరపు శ్రీనివాసరావు, తిరుకోడి శాంతిసుధ, కాశి లక్ష్మణస్వామి, కోలా బాబ్జి, కాశి జగపతిరావు, కాశి రామకృష్ణ, జగతా బాబ్జి, దేవరపల్లి ఏడుకొండలలతో పాటు నాలుగు మండలాల అంబేడ్కరీయులు, అభిమానులు, నాయకులు, పాల్గొన్నారు. తొలుత ముందు అంబేడ్కరీయులు తీన్‌మార్, డీజేలతో బాణాసంచాలు కాల్చి భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, జనవరి 27: ముమ్మిడివరం పోలమ్మ చెరువుగట్టున నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు శిలా విగ్రహానికి తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ నివాళులర్పించారు. ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించిన అనంతరం గంటి హరీష్‌మాధుర్ కాశివానితూము పల్లిపాలెం సెంటర్‌లోని నగరం పంచాయతీ మాజీ చైర్‌పర్సన్ చెల్లి శాంతకుమారి నివాస గృహం నుంచి పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా తరలివచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్, కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, మిమ్మితి చిరంజీవి, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, బొంతు నాగరాజు, కాశి లాజర్, కాశి రామచంద్రరావు, అయినవిల్లి వలీబాబా, మెండి కృష్ణబాబు, సిద్ధిన పెదబాబు, వడ్డి సత్తిబాబు తో పాటు పలువురు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల ఆందోళన



ఉద్యోగుల మానవహారం

అమలాపురం టౌన్, జనవరి 26: తెలంగాణ తరహాలో సెర్ప్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందిని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్లతో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 5వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని ఆర్పీఐ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, నాయకుడు కె.వెంకటరెడ్డి తదితరులు సందర్శించి సెర్ప్ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. మలికిపురం, మామిడికుదురు, సఖినేటపల్లి మండలాల వీవోఏలు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా అమలాపురం గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. గడియార స్తంభం సెంటర్‌లో కోనసీమ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు ఏవిధంగా కేడర్ ఫిక్సేషన్ చేశారో అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో చేసి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ సీసీలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, గ్రాట్యుటీ రూ.16 లక్షలు చెల్లించాలని, అన్ని కేడర్లకు పదోన్నతులు కల్పించాలని నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జేఏసీ జిల్లా అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, ర్యాలి అర్జున్, ముత్యాల రమేష్, భూపతి వర్మ, పి.రమాకాంత్, పీవీవీ రమణ, ఎంపీఎల్ విజయకుమారి, డి.అజయ్, కె.వెంకటలక్ష్మి, ఎం.రవిరాజా, వీవోఏల జిల్లా సంఘం ప్రతినిధులు మట్టా మంగాదేవి, బళ్ల విజయ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌పై అధికార పార్టీ వేధింపులు

వార్త..5లో

తెలుగుదేశం పిలుస్తోంది

రేపే.. రా కదలి రా..


కాతేరులో సభ ఏర్పాట్లకు భూమి పూజ చేసిన యనమల, రాజప్ప,గోరంట్ల , రవి, బత్తుల

- రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో బహిరంగ సభ
- 23 ఎకరాల్లో వేదిక ఏర్పాట్లు ● చంద్రబాబు నాయుడు హాజరు
- ఏర్పాట్లకు యనమల, రాజప్ప, గోరంట్ల భూమి పూజ

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈనెల 29న తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభ ఏర్పాట్లను శనివారం ఉదయం 9.30 గంటలకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, జోన్- 2 కోఆర్డినేటర్ రవి, జనసేన రాజానగరం ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేతలు యర్రా వేణు గోపాల్‌రాయుడు, కోనేరు నవీన్ తదితరులు భూమి పూజ చేశారు. వేద మంత్రాల మధ్య రాట పాతి పనులు ప్రారంభించారు. అనంతరం ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ సభకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి అత్యధికంగా క్యాడర్ తరలి రావాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ 23 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హెలిప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లు, భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబు సభకు పార్టీ కార్యకర్తలు, నేతలు, జనసైని కులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు ఇచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రూరల్ నుంచి అన్నివర్గాల ప్రజలు వచ్చేలా ప్రచారం చేయాలన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఈసభ జరగనున్నదని, ఏర్పాట్లు చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, అంగర రామ్మోహనరావు, చిల్లా జగదీశ్వరి, పెచ్చెట్టి చంద్రమౌళి, డొక్కా నాథ్‌బాబు, వాసిరెడ్డి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, మజ్జి పద్మావతి, గంగిన హనుమంతరావు, మార్ని వాస్‌దేవ్, పండూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన రూరల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రేపు చంద్రబాబు పర్యటన ఇలా...

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజమహేంద్రవరం రానున్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని కాతేరులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా.. సభకు ఆయన హాజరవుతున్నారు. దీనికోసం ఆయన 29న నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45 గంటలనుంచి ఒంటిగంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 1.50కు బయలుదేరి కాతేరులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి వెళతారు.

అపరాధ రుసుముతో.. ఇంటర్ పరీక్షల ఫీజుకు రేపే చివరి తేదీ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలవల్ల ఇప్పటి వరకూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2024 నిమిత్తం ఫీజు చెల్లించని వారు తత్కాల్ స్కీం కింద అపరాధ రుసుం రూ.3వేలతో ఈనెల 29 (సోమవారం) సాయంత్రం 5గంటలలోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం సూచించారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లోని రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల బాధ్యులు చొరవ చూపాలన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజును ఆన్‌లైన్ పేమెంటు ద్వారా బోర్డుకు ప్రిన్సిపాల్స్ జమచేయవచ్చన్నారు.

రేపు వికాసలో జాబ్ మేళా : పీడీ

కాకినాడసిటీ, జనవరి 27: ఈనెల 29న కాకినాడలోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో మెరైన్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఎస్ఆర్ అకౌంటెంట్, ఈవో డీల్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం కంపెనీలో టెక్నీషియన్, సీఐఈ ఆటోమోటివ్ ఇండియా లిమిటెడ్‌లో టెక్నీషియన్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) ఉద్యోగాలతో పాటు డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 7799376333లో సంప్రదించాలన్నారు.

ఫిబ్రవరి 3కు మారిన 'ఉమ్మడి' జిల్లా పరిషత్ సమావేశం

కాకినాడ సిటీ, జనవరి 27: ఈనెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం అనివార్య కారణాలవల్ల ఫిబ్రవరి 3వ తేదీకి మార్పు చేసినట్లు జడ్పీ సీఈవో ఏ.రమణారెడ్డి తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 నుంచి జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధశాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రగతి ప్రధాన అజెండాగా సమీక్షిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో 3వ తేదీ ఉదయం 10.30కు హాజరుకావాలని సీఈవో ఒక ప్రకటనలో కోరారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.4 లక్షలు

ఆత్రేయపురం, జనవరి 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలనుంచి భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ షర్మిలారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.38.4 లక్షలు లభించినట్టు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. అలాగే జబర్దస్త్‌తో పాటు వివిధ బుల్లితెర షోలలో నటిస్తున్న యాంకర్ వర్షిణి శనివారం కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారి చిత్రపటం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నటి వర్షిణికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

గోదావరి రొయ్యు సీడ్ కోసం

మత్స్యకారులపై ఒత్తిడి

- రెండు వర్గాలతో హైపవర్ అఫీషియల్స్ సమావేశం
- మత్స్యకారులతో మంత్రి వేణు, కలెక్టర్, కోనసీమ అధికారుల చర్చలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం, జనవరి27(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం బ్యారేజి దిగువ ప్రాంతంలో బ్యారేజి నుంచి నీటి ప్రవాహం ఉన్న సమయాల్లో మత్స్యకారులు వేటాడిన రొయ్యసీడ్‌ను మత్స్యశాఖకు ఇవ్వాలని, కానీ అందరూ ఇవ్వడంలేదని కారణంతో మంత్రి చెల్లుబోయిన వేణు, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారులు ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులతో చర్చించారు. పూర్వం నుంచి ధవళేశ్వరం బ్యారేజి దిగువన రొయ్యసీడ్ ను ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులు వేటాడుతుంటారు. ధవళేశ్వరం మత్స్యకార సొసైటీ 1 నుంచి 70 బ్యారేజీ గేట్ల వరకూ వేటాడుకోవచ్చు. వీరు లీజుకు తీసుకున్నారు. బొబ్బర్లంక సొసైటీ వారు లీజుకు తీసుకోకుండానే చాలా కాలం నుంచి రొయ్య పిల్లల వేట సాగిస్తున్నారు. ధవళేశ్వరం సొసైటీ లీజుకు తీసుకున్న పరిధిలోకి వారు వచ్చేసి వేటాడుతున్నట్టు ఆరోపణ. అది ఒక సమస్య కాగా, ఇక్కడ అసలు సమస్య ఒకటి ఉంది. ప్రతిఏటా అఖండ గోదావరిలో రొయ్య పిల్లలను అధికారులు వదులుతుంటారు. అవి పెద్దవి అయ్యాక, మత్స్యకార్లకు ఉపాధి ఉంటుందనేది వారి లక్ష్యంగా చెబుతుంటారు. కానీ దీనికోసం బ్యారేజి దిగువ రొయ్య పిల్లలను వేటాడేవారు మత్స్యశాఖకు ఉచితంగా రొయ్యపిల్లలు ఇవ్వాలి. ధవళేశ్వరం సొసైటీ వారు ప్రతిఏటా 5 లక్షల పిల్లలను ఇస్తుంటారు. కానీ బొబ్బర్లంక సొసైటీ వారు ఇవ్వడంలేదు. దీనిపై ప్రధానంగా సమావేశం నిర్వహించారు. తాము తమ పెద్దలనాటి నుంచి వేటాడుతున్నామని, ఎప్పుడూ లీజుకు తీసుకోలేదు. రొయ్య పిల్లలూ ఇవ్వలేదని బొబ్బర్లంక సొసైటీ మత్స్యకారులు వాదించారు. కానీ దీనిపై అధికారులు జోక్యం చేసుకుని గతంలో లాగా ఉచితంగా వేటకు వీలులేదని, మారిన నిబంధనల మేరకు లీజుకు తీసుకుని రొయ్య పిల్లలను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. పైగా ఎంత సీడ్ వేటాడుతున్నారో కూడా చెప్పాలన్నారు. ఈ పిల్లలను తిరిగి గోదావరిలో వదలడంవల్ల అవి ఎదిగిన తర్వాత ఎగువ దిగువ మత్స్యకారులకు ఉపాధికి ఉపయోగపడతాయని చెప్పారు. మంత్రి వేణు మాట్లాడుతూ ధవళేశ్వరం, బొబ్బర్లంకల్లో మత్స్యకారులందరికీ ఉపాధి కలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత మాట్లాడుతూ ధవళేశ్వరం సొసైటీ మాదిరిగా బొబ్బర్లంక సొసైటీ కూడా లీజుకు దరఖాస్తు చేసుకోవాలని, అది పూర్తయిన తర్వాత ఏరియాను విభజిస్తారని, ఎవరి పరిధిలో వారు వేటాడుకో వచ్చని చెప్పారు. మత్స్యశాఖ జేడీ కృష్ణారావు మాట్లాడుతూ అందరూ కచ్చితంగా రొయ్యసీడ్ ఇవ్వాల్సిందే నన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పి.జగదీశ్, జేసీ ఎన్.తేజ్‌భరత్, అంబేద్కర్ కోనసీమజిల్లా జేసీ శ్రీవాస్ నూపర్ అజయ్, ఏఎస్పీ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ మేళం' అలరిస్తోంది

- హీరో సుహాస్, హీరోయిన్ శివాని


మాట్లాడుతున్న హీరో సుహాస్, హీరోయిన్ శివాని

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27: వచ్చేనెల 2న విడుదల కాబోతున్న అంబాజీపేట మేరేజ్ బ్యాండ్ మేళం సినిమా ప్రేక్షకులందరినీ అలరిస్తోందని ఆ చిత్రం హీరో సుహాస్, హీరోయిన్ శివాని తెలిపారు. ఈ సినిమా ప్రమోషన్ వర్క్‌లో భాగంగా చిత్ర బృందం శనివారం రాజమహేంద్రవరం విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానిక షెల్టాన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సుహాస్ మాట్లాడారు. ఈ సినిమా విడుదలయ్యాక ప్రేక్షకుల నుంచి వచ్చే ఆనందం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ప్రమోషన్ వర్క్‌లో భాగంగా విశాఖ, కాకినాడ మీదుగా రాజమహేంద్రవరం వచ్చామన్నారు. కవల పిల్లలైన అక్కా తమ్ముడు పుట్టిన రోజు సందర్భంగా జరిగే సంఘటన ఆధారంగా వాళ్ల జీవితాలు ఎలా మలుపుతిప్పాయన్నది చిత్ర ఇతివృత్తమన్నారు.

కాకినాడలో ఫిబ్రవరి 26న

అప్పా రాష్ట్ర మహాసభలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 26వ తేదీన కాకినాడలో నిర్వహిస్తున్నట్లు అప్పా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో అసోసియేషన్ విశాఖ, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పా రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో పేదలకు ప్రభుత్వ విద్య దూరమవుతున్నదని తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలను విలీనం పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తే పేదల పిల్లలు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడంలేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయడంలేదని తెలిపారు. ప్రతి ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన అప్పా ప్రతినిధులు పాల్గొన్నారు.


ఏపీ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల పోస్టరును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా
- అత్యాశతో చిక్కుల్లో పడొద్దు : సీఐడీ ఏఎస్పీ పాపారావు

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఐజీఎస్‌సీఎస్ సౌజన్యంతో రాజమహేంద్రవరం ప్రాంతీయ సీఐడీ అధికారి ఆధ్వర్యంలో సైబర్ నేరాల తీరు, వాటిని అరికట్టే విధానాలపై పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్‌ని ఆవిష్కరించి మాట్లాడారు. అంతగా చదువుకోని వాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతుంటే బాగా చదువుకున్న వారు సైతం వాటిని ఎదుర్కోవడంలో విఫలం కావడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇటీవల నమోదవుతున్న కేసుల్లో ఎక్కువగా అలాంటివే ఉంటున్నాయన్నారు. దీనికి సాంకేతికతపై అవగాహన లేకపోవడమే అసలు కారణమన్నారు. సాంకేతిక పరికరాలను వినియోగించే క్రమంలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసం జరిగిందని గ్రహించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి గానీ, సైబర్ క్రైం పోలీసులకుగానీ ఫిర్యాదు చేయాలన్నారు. సీఐడీ అదనపు ఎస్పీ పాపారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను అత్యాశతో క్లిక్ చేస్తూ చిక్కుల్లో పడుతున్నారని తెలిపారు. మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ఆశ కల్పిస్తుంటారని గ్రహించాలన్నారు. బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత, ఆధార్, పాన్, ఏటీఎం నెంబర్, పిన్, ఓటీపీ వివరాలను అపరిచితులతో పంచుకోకూడదన్నారు. హైదరాబాద్‌లోని ఇన్‌ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ మాజీ సీఐఎస్‌వో బీ.శ్రీనివాస్ ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల వినియోగంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటీపీలు చెప్పమనడం, మోసపూరిత లింకులు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు ఇబ్బందులకు గురిచేస్తాయన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచకపోవడమే మేలన్నారు. టోల్‌ఫ్రీ నెం.1930 ఆవశ్యకత గురించి సీఐడీ హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సురేశ్ వివరించారు. ఉదయం సెషన్‌లో ఉమ్మడి గోదావరి జిల్లాల పోలీసు సిబ్బంది, జీఎంఎస్‌కే, మధ్యాహ్నం సెషన్‌లో కాలేజీ విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది, నెట్‌వర్క్ ప్రొవైడర్లు హాజరయ్యారు. వారికి సైబర్ క్రైంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విశదీకరించడంతో పాటు సంబంధిత మెటీరియల్‌ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు బి.రామకృష్ణ, సీహెచ్ పెంటారావు, ఇన్‌స్పెక్టర్లు జీవీవీ సత్యనారాయణ, ఎం.బాల కృష్ణ, ఐ.గోపాలకృష్ణ, డి.విజయ్‌కుమార్, పీవీవీ నరసింహరావు, ఎం.శేషు, వి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, జి.రమేశ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ పాపారావు

దళిత సర్పంచ్‌పై అధికార పార్టీ వేధింపులు

- సర్పంచ్‌కు సమాచారం లేకుండా డీపీవో సమావేశం
- అధికార పార్టీ నాయకుడి ప్యాలెస్ సీసీ రోడ్డు నిర్మాణానికి తీర్మానం


ఆత్రేయపురం గ్రామపంచాయతీలో డీపీవో కృష్ణకుమారి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 27: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం గ్రామ దళిత సర్పంచ్ గెద్దం సుధారాణిపై అధికారపార్టీ వేధింపులకు పాల్పడుతుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌గా సుధ టీడీపీ తరుపున ఎన్నికయ్యారు. వార్డు సభ్యులు అధికార పక్షానికి చెందిన వారు కావడంతో దళిత సర్పంచ్‌కు అధికార పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని సుధ ఆరోపిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తుండగా అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆమె పేర్కొన్నారు. పంచాయతీకి స్వాధీనం చెయ్యని భూమిలో అధికార పార్టీ నాయకుడికి చెందిన ప్యాలెస్‌కు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించేందుకు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వార్డు సభ్యులు తీర్మానం ఆమోదించడం సర్పంచ్‌లు వ్యతిరేకించడంతో వివాదం చెలరేగింది. శనివారం సర్పంచ్ సుధకు తెలియకుండానే డీపీవో కృష్ణకుమారి అభ్యర్ధన మీటింగ్‌ను పంచాయతీలో నిర్వహించడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ అక్కడికి చేరుకుని డీపీవోను నిలదీశారు. సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా అభ్యర్ధన మీటింగ్ నిర్వహించడం ఎంతవరకూ న్యాయమని ఆమె ప్రశ్నించారు. పేద ప్రజలకు అవసరమైన కనీస పనులను అభివృద్ధికి అడ్డుతగులుతూ అధికార పార్టీ నాయకుడికి స్వప్రయోజనం చేకూర్చే పనులు ఆమోదించడం ఎంత వరకూ సబబు అని ఆమె నిలదీశారు. సర్పంచ్ అభ్యంతరాలను లెక్కచేయని డీపీవో కృష్ణకుమారి అధికార పార్టీకి అనుకూలంగా వర్క్స్ కమిటీని ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఆమోదంకోసం నివేదికను పంపించడంపై సర్పంచ్ మండిపడ్డారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈవిషయంపై డీపీవో కృష్ణకుమారిని వివరణ కోరగా వార్డు సభ్యుల అభ్యర్ధన మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి పనులకు ఆమోదం తెలపలేదని మెజార్టీవార్డు సభ్యుల అభిప్రాయం మేరకు ఏడుగురుతో వర్క్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. దీనిని కలెక్టర్ ఆమోదం కోసం పంపించామన్నారు.

చీటింగ్ నేరంపై అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అరెస్ట్

సామర్లకోట, జనవరి 27: సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న కమ్మిల శ్రీనువాస్ అనే యువకుడు ఒక మహిళా వివాదాన్ని సెటిల్మెంట్ చేస్తానని, తాను చెబితే అధికారులు, రాజకీయ నాయకులు సిఫార్స్ చేస్తారని నమ్మబలికి ఆమె వద్ద నుంచి రూ.1.27లక్షలు వసూలు చేసి ఆ తర్వాత ముఖం చాటేసిన కేసులో శ్రీనువాస్‌ను సామర్లకోట పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపర్చడంతో రిమాండ్ విధించినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. తనకు జరిగిన ఒక సంఘటనలో ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు రాగా సదరు మహిళను నమ్మించి తనకు పలుకుబడి ఉందని చెప్పి ఆమె నుంచి డబ్బులు వరుసగా వసూలు చేశాడు. తీరా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో నేరుగా పోలీసు అధికారులకు జరిగిన మోసాన్ని వివరించడంతో పోలీసులు తక్షణం విచారించి మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించి అరెస్ట్‌చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సామర్లకోట పోలీసులు శనివారం తెలిపారు. ఇక నుంచి శ్రీనువాస్‌ను మున్సిపల్ విధులకు అనుమతించేది లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు.

చెట్టుని ఢీ కొట్టిన కారు

- షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


చెట్టుకు ఢీకొని దగ్ధమవుతున్న కారు

యానాం. జనవరి 27: యానాం శివారు ఇసుకకాలువ వద్ద అదుపుతప్పి కారు రోడ్డు డివైడర్‌ను, చెట్టును ఢీకొట్టింది. షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం యానాం నుంచి స్నేహితులతో కలిసి దొమ్మేటిపేటలో ఉన్న స్నేహితుడి కొబ్బరితోటలో భోజనాలు చేయటానికి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఇసుక కాలువ వద్ద అదుపుతప్పి ఒక పక్కకు ఒరిగింది. ప్రమాదం జరిగే సమయానికి నలుగురు యువకులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో క్షణాల వ్యవధిలో కారు దగ్ధమైంది. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక వాహనం మంటలను అదుపుచేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే కారులో ఉన్న వారు యానాం వాసులుగా గుర్తించారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యంకోసం కాకినాడ తరలించారు. ఈసంఘటలో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈసంఘటనపై యానాం ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


కె.పెదపూడి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసిన సర్పంచ్
- కార్యదర్శి ఫిర్యాదుతో చెక్ పవర్ రద్దు చేసిన డీపీవో

అంబాజీపేట, జనవరి 27: నిబంధనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అందించిన 15వ ఆర్థిక సంఘం నిధులను చెక్ ద్వారా బ్యాంకు నుంచి నేరుగా డ్రా చేసిన అంబాజీపేట మండలం కె.పెదపూడి సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.కృష్ణకుమారి ఉత్తర్వుల జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి మేజర్ పంచాయతీకి గత ఏడాది ఆగస్టు నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.4లక్షలు పంచాయతీ ఖాతాకు జమయ్యాయి. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించి వీటిని చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఖాతాకు జమ అయిన మరుసటిరోజు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణకు తెలియకుండా సర్పంచ్ బీర శాంతి బ్యాంకు నుంచి చెక్ ద్వారా రూ.3.70 లక్షలు డ్రా చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ గ్రామ్ స్వరాజ్ ద్వారా సీఎఫ్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేసి నిధులు డ్రా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ నిబంధనలకు వ్యతిరేకంగా సర్పంచ్ శాంతి నిధులు డ్రా చేయడంతో పంచాయతీ కార్యదర్శి గత ఏడాది జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. డిసెంబర్ నెలలో డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు, అంబాజీపేట ఈవోపీఆర్డీ బి.మమత పంచాయతీ విత్‌డ్రా చేయడంపై స్థానిక పంచాయతీలో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందించారు. విచారణను పరిశీలించిన డీపీవో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుచేస్తూ జనవరి 25వ తేదీన ఉత్తర్వులు అందించారు. ఈ ఉత్తర్వులను సర్పంచ్‌కు రిజిష్టర్ పోస్టుతో పాటు స్వయంగా అందించాలని తెలిపినట్లు ఈవోపీఆర్డీ మమత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కుమార్తెను చూసి వెళుతుండగా ప్రమాదం
- మోటారు సైకిల్‌ను మినీ వ్యాన్ ఢీకొని మృతి


రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్యాభర్తలు గారపాటి వెంకట్రావు, మంగతాయారు

అమలాపురం రూరల్, జనవరి 27: అత్తవారింటి వద్ద ఉన్న కుమార్తెను చూసేందుకు పిల్లావారిగరువుకు వచ్చిన భార్యాభర్తలు తిరుగు ప్రయాణంలో మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మినీవ్యాన్ వేగంగా వచ్చి మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగింది. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బోడసకుర్రులోని టిడ్కో గృహాల సముదాయంలో ఉంటున్న గారపాటి వెంకట్రావు(55), భార్య మంగతాయారు(50)లు కుమార్తెను చూసేందుకు మండల పరిధిలోని పిల్లావారిగరువుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో బైపాస్ రోడ్డులో బోడసకుర్రువైపు వెళుతుండగా రోళ్లపాలెం సమీపానికి వచ్చేసరికి మినీవ్యాన్ డ్రైవరు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ కె.క్రిష్టఫర్, రూరల్ సీఐ పి.వీరబాబు, అల్లవరం, పట్టణ ఎస్ఐలు హరీష్‌కుమార్, సత్యనారాయణలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాను డ్రైవరుపై కేసు నమోదుచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

పితాని బాలకృష్ణ పరామర్శ

ముమ్మిడివరం, జనవరి 27: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముమ్మిడివరానికి చెందిన పి.రాజేష్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ పరామర్శించారు. కర్రివానిరేవు గ్రామానికి చెందిన నవరపు నాగరాజు, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన పెట్టా వెంకటేశ్వరరావులు ప్రమాదవశాత్తూ గాయపడగా వారిని బాలకృష్ణ పరామర్శించారు. జక్కంశెట్టి పండు, కడలి వెంకటేశ్వరరావు, పితాని రాజు, దూడల స్వామి, లంకలపల్లి జమి, కర్రి శేఖర్, పడాల లక్ష్మణ్, కాశిం తాతాజీ పాల్గొన్నారు.

రాజోలు స్థానం టీడీపీకే కేటాయించాలి



మంగళగిరిలో టీడీపీ కార్యాలయం ఆవరణలో గొల్లపల్లికి మద్దతుగా ప్లకార్డులతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు

రాజోలు, జనవరి 27: రాజోలు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు 60వాహనాల్లో 300మంది మంగళగిరి వెళ్లారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడును కలిశారు. టీడీపీ-జనసేన పొత్తులో రాజోలు సీటు టీడీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు ఇవ్వాలని కోరారు. అన్ని విషయాలు త్వరలోనే పూర్తిస్థాయిలో సమీక్షించి, గొల్లపల్లి సూర్యారావుకు, రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చేస్తామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి తెలిపారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, మంగెన భూదేవి, కొల్లాబత్తుల కుమార్, చెల్లింగి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, టీడీపీ మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల అధ్యక్షులు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, సర్పంచ్ చెల్లుబోయిన హెలీన, రాపాక నవరత్నం, బందెల పద్మ, కాండ్రేగుల భవానీ, చింతపల్లి నాగలక్ష్మి, అడబాల రమాదేవి, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు గుర్తింపు

- టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ హరీష్‌మాధుర్
- అంబాజీపేటలో జయహో బీసీ సభ
- వైసీపీని అంతమొందించాలని పిలుపు

అంబాజీపేట, జనవరి 27: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హయాంలోనే బీసీలకు తగిన ప్రాధాన్యంకల్పించి, మంచి గుర్తింపు తీసుకువచ్చారని ఆ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు.అంబాజీపేటలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు పెదబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రాక్షస పాలనకు గుణపాఠం చెప్పాలన్నారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసి నిధులు ఇవ్వకుండా ఛైర్మన్లను ఉత్సవ విగ్రహాలుగా సీట్లలో ఉంచారని విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీలకు తీవ్రఅన్యాయం జరిగిందన్నారు. గ్రామాల్లో ఉన్న టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులంతా కలిసిగట్టుగా వైసీపీని అంతమొందించాన్నారు. సర్పంచ్ నాగాబత్తులశాంతకుమారి నాయకులు గుత్తుల సాయి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యసత్యం, దాసరి సత్యనారాయణ, షేక్ సుభాన్, పెచ్చెట్టి విజయలక్ష్మి, మద్దా చంటిబాబు, గణపతి వీరరాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, పెంద్ర రమేష్, వాడ్రేవు వీరబాబు, యడ్లపల్లి తుక్కియ్య, నేదునూరి కళ్యాణ్, సంసాని పెద్దిరాజు, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, దొమ్మేటి శ్యామ్, మట్టపర్తి రామకృష్ణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.





అంబాజీపేట: మాట్లాడుతున్న గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద

ఎన్నికలకు సమాయత్తం కావాలి

ముమ్మిడివరం, జనవరి 27: రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి విజయం చేకూర్చే విధంగా బూత్ కమిటీ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు వ్యూహాత్మకంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు స్వగృహంలో అర్ధాని శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాలకు సంబంధించి బూత్ కమిటీ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తిచేసి ఎన్నికల్లో విజయ కేతనం ఎగురవేసే విధంగా కృషి చేయాలన్నారు. శిక్షణా తరగతులకు ఇన్‌చార్జిలుగా విచ్చేసిన బొబ్బా ప్రభాత్, బోళ్ల రాజేష్‌లు ఎన్నికల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. అధికార పార్టీ ఎత్తుగడలను ఏవిధంగా తిప్పి కొట్టాలనే విషయాలపై అవగాహన కల్పించారు. నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, సాగి సూరిబాబురాజు, నడింపల్లి సుబ్బరాజు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, పొద్దోకు నారాయణరావు, దాట్ల బాబు, మాదే యోగీశ్వరి, బొక్కా రుక్మిణి, గంగుమళ్ల భద్రం, నడిమింటి సూర్యప్రభాకరం, పిల్లి నాగరాజు, రంకిరెడ్డి రాంబాబు, చింతలపూడి కొండబాబు, కుంచనపల్లి వెంకన్నబాబు, గుద్దటి వీరాస్వామినాయుడు, యాళ్ల ఉదయ్, జంగా శ్రీను, దంతులూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.

'అన్నివర్గాలను మోసం చేసిన సీఎం జగన్'

మండపేట, జనవరి 27: ఒక్క చాన్స్ అంటూ సీఎం అయిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, అన్నివర్గాల ప్రజలను మోసం చేశాడని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. కేశవరంలో మూడో రోజు శనివారం నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. టీడీపీ, జనసేన సంకీర్ణ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కర్రి తాతరావు, కంటిపూడి శ్రీనివాసరావు, ఉండమట్ల సురేష్, గుండ్ల ఈశ్వరరావు, కంటిపూడి రాంబాబు, సత్యనారాయణ, కోటి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల

నేటి సమాజంలో ఎలక్ట్రీషియన్ల పాత్ర కీలకం

ఆలమూరు, జనవరి 27: నేటి సమాజంలో ఎలక్ట్రీషియన్ల పాత్ర చాలా కీలకంగా మారిందని పలువురు వక్తలు అన్నారు. ఆలమూరులో స్వశక్తి ఎలక్ట్రీషియన్స్, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ జెండా స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం శనివారం మండల కాపు సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నాయకులు చల్లా నానాజీ, కొండే రామకృష్ణ, శ్యామ్, యూనియన్ నాయకులు కాళ్ల సత్తిబాబు, సింగవరపు సత్యవరరామ్‌ప్రసాద్, సూరంపూడి రామకృష్ణ, ఏడిద సూర్యగోపాలాచార్యులు, వి.బాలరాజు, బుంగ శ్రీనివాస్, ముర్రా మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ కార్మికులను ఆదుకోవాలని ర్యాలీ

మామిడికుదురు, జనవరి 27: ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఎలక్ట్రీషియన్ డే రోజున శ్రీనవదుర్గ ఎలక్ట్రికల్ ప్రైవేటు యూనియన్ కార్మికులు శనివారం బైక్ ర్యాలీ చేశారు. తాటిపాక నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు మెడబాల రామారావు, బత్తుల జనార్ధనరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, చిట్టూరి శ్రీనివాస్, గంటి రామారావు, కోళ్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమావేశం

కాట్రేనికోన, జనవరి 27: శ్రీనవచైతన్య ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ రీవైండింగ్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కాట్రేనికోనలో ఎలక్ట్రీషియన్ డే నిర్వహించారు. థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎలక్ట్రికల్ ఏఈ బి.నాగేశ్వరరావు వర్కర్లకు పలు సూచనలు చేశారు. అందరూ జీవిత బీమా చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయిదుర్గా ఏజెన్సీస్ అధినేత వాసంశెట్టి రాజారమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, సానబోయిన నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షుడు సంసాని కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కర్రి శ్రీనివాసవర్మ, కార్యదర్శి కాగిత సత్తిబాబు, సంయుక్త కార్యదర్శి దొమ్మేటి నాగేశ్వరరావు, కోశాధికారి వనచర్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో బైకు ర్యాలీ చేస్తున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్

విద్యార్థులకు ట్యాబ్‌లపై అవగాహన పెంచాలి



పొన్నమండలో విద్యార్థినుల నుంచి జవాబులు రాబడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

రాజోలు, జనవరి 27: రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ రంగానికి రూ.3వేల కోట్లు కేటాయించిందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ తెలిపారు. తాటిపాక, పొన్నమండ, రాజోలు జడ్పీ ఉన్నత పాఠశాలలు, పొన్నమండ మెయిన్ మండల పరిషత్ పాఠశాల, రాజోలు జూనియర్ కళాశాలలను ప్రవీణ్‌ప్రకాష్ శనివారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల వద్దకు వెళ్లి మాట్లాడి వారి నుంచి సమాధానం రాబట్టారు. హైస్కూలులో విద్యార్థినులకు ట్యాబ్‌లపై సరైన అవగాహన లేదని సిబ్బందిపై మండిపడ్డారు. పొన్నమండ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా 21మంది విద్యార్థులు ఉండడమేమిటని ప్రశ్నించారు. పొన్నమండలో ప్రవీణ్‌ప్రకాష్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రవీణ్‌ప్రకాష్, కలెక్టర్ శుక్లా పొన్నమండ హైస్కూల్‌ను తనిఖీచేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రవీణ్‌ప్రకాష్ పర్యటనతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పరుగులు పెట్టారు. అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, డీఈవో కమలకుమారి, ఆర్జేడీ జి.నాగమణి, ఎంఈవోలు ఎన్.మనోహరం, టీఎస్‌ఆర్కే ప్రసాద్, హెచ్‌ఎంలు,సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల ఆకలి తీర్చారు

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

అమలాపురం టౌన్, జనవరి 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా క్రీడాకారులకు భోజన సదుపాయాలు కల్పించని పరిస్థితిపై ఈనెల26న ఆంధ్రజ్యోతిలో క్రీడాకారుల ఆకలి కేకలు శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతుండగా శనివారం సకాలంలో క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణంలో ఫస్ట్‌ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయని అంశంపై స్పందించిన అధికారులు ఏకంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

అపరిశుభ్రంగా మార్కెట్

- జారిపడిన మహిళకు గాయాలు

యానాం. జనవరి 27: యానాం ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్ అపరిశుభ్రంగా ఉంది. దీంతో స్థానిక మత్స్యకార మహిళలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా మార్కెట్‌ను శుభ్రం చేయకపోవడంతో నాచు పట్టింది. శుక్రవారం ఒక మహిళ జారి పడటంతో చెయ్యి విరిగింది. దీంతో స్థానిక వ్యాపార మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మార్కెట్‌ను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

రాముకు జ్యూరీ అవార్డు

అమలాపురం రూరల్, జనవరి 27: రాష్ట్రస్థాయిలో గుళ్లపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ-2024లో బండారులంకకు చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ మాడా రాము జ్యూరీ అవార్డును కైవసం చేసుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, జి.ఎలీషా, శ్రీకాంత్‌శర్మ తదితరులు అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

రాజోలు, జనవరి 27: రాజోలులో సీసీఎల్‌ఏ నిధులు రూ.90లక్షలతో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, తహసీల్దార్ బి.ముక్తేశ్వరరావు, సర్పంచ్ రేవు జ్యోతి, జడ్పీటీసీ మట్టా శైలజ, నక్కా రామారావు, మట్టా ఏడుకొండలు, కంచర్ల శేఖర్, గెద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బహిరంగ సభను విజయవంతం చేయండి

యానాం. జనవరి 27: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని పెద తాడేపల్లిలో ఫిబ్రవరి 11న జరిగే బీసీ బహిరంగసభను విజయవంత చేయాలని యానాం బీసీ సంఘ నేత గుత్తుల గోవింద జయరామారావు అన్నారు. బీసీ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరపల్లి శ్రీనివాస్ బృందం యానాంలో పలువురు బీసీ నేతలతో సమావేశమయ్యారు. బహిరంగ కరపత్రాలను యానాం బీసీ నాయకులకు అందజేశారు. ఈబహిరంగసభలో 9ప్రధాన డిమాండ్లపై చర్చిస్తామన్నారు.

సర్పంచ్ బాలరాజును సత్కరించిన గ్రామస్థులు

అంబాజీపేట, జనవరి 27: రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శిగా నియమితులైన పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజును శనివారం ఎస్సీ యూనియన్ అధ్యక్షుడు చిల్లి యాకోబ్ అధ్యక్షతన జరిగిన సభలో బాలరాజును గ్రామస్తులు సత్కరించారు కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీరా రవి, ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, సొసైటీ అధ్యక్షుడు నందుల ఆదినారాయణ, నాయకులు నూకపెయ్యి చిన్న, అందె వెంకటముక్తేశ్వరరావు, ఎస్‌ఎస్ఎన్‌వర్మ, వక్కలంక బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

మామిడికుదురు, జనవరి 27: ఇటీవల మొగలికుదురులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బడుగు వెంకటరమణ కుటుంబానికి జనసేన నాయకుడు గిడ్డి సత్యనారాయణ రూ.10వేలు అందించారు. అదేగ్రామానికి చెందిన మన్నెం కమలేశ్వరరావు కాలికి గాయమైంది. అతడికి రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, సర్పంచ్ అడబాల తాతకాపు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, వాసంశెట్టి వెంకటరమణ, నాయకులు మద్దింశెట్టి బుజ్జి, కంకిపాటి నరసింహారావు, తుండూరి బుజ్జి, బళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ ఇండియా బాధితులను ఆదుకోవాలి

అమలాపురం టౌన్, జనవరి 27: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం కేంద్రంగా సువర్ణ ఇండియా కంపెనీని ఏర్పాటు చేసి రూ.14కోట్ల మేర డిపాజిట్లు సేకరించి టోకరా వేసిన కేసుల్లో సత్వరం విచారణ పూర్తిచేసి ఖాతాదారులను, ఏజెంట్లను ఆదుకోవాలని బాధిత సంఘం అధ్యక్షుడు కాశి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. ఎనిమిదేళ్లు అయినప్పటికీ ఐదు కేసులు కోర్టు పెండింగుల్లో ఉండిపోయాయని, సీజ్ చేసిన భూములను సువర్ణ ఇండియా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బూసిం వెంకటనాగవేణు ఒక్కొక్కటిగా విక్రయించుకుంటూ పోతున్నారని ఆరోపించారు. కలెక్టర్ సీజ్ చేసిన భూములను అమ్మి డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని కోరారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో శనివారం జరిగిన సమావేశంలో బాధిత సంఘ నాయకులు సీహెచ్ రత్నంరాజు, డి.రాంబాబు, కె.విజయకుమార్, జల్లి ప్రసన్నవాణి, బీవీవీ సత్యనారాయణ, వి.భానోజీరావు, కె.శామ్యూల్‌రెడ్డి, పి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాన్నకు వందనం...

ఉప్పలగుప్తం, జనవరి 27: మండలంలో ప్రాథమిక చికిత్స ద్వారా ఎందరో గ్రామీణ ప్రజలకు అండగా ఉంటున్న పీఎంపీ, ఆర్‌ఎంపీలు తమ పిల్లలను గుర్తింపు పొందిన డాక్టర్లగా సమాజానికి అందించారు. సన్నవిల్లిలో జరిగిన పీఎంపీ, ఆర్‌ఎంపీ అసోసియేషన్ వార్షిక సమావేశంలో ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో వైద్యులుగా పనిచేస్తున్న పీఎంపీల కుమారులు, కుమార్తెలను ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రాథమిక చికిత్సకు మాత్రమే అర్హులై చాలీచాలని ఆదాయంతో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని తమకు వైద్యవిద్య నేర్పించిన తల్లిదండ్రులకు సన్మాన గ్రహీతలు వందనం సమర్పించారు. కుందెం భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోనసీమ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నిమ్మకాయల లక్ష్మణరావు, అధ్యక్షుడు కె.బాబూరావు, కార్యదర్శి మహ్మద్ రఫీ, కోశాధికారి దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.నాగేశ్వరరావు, మండల కార్యదర్శి వజ్రపు రాంబాబు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

రాయవరం, జనవరి 27: రాయవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ఆశాంతం మొక్కుబడిగా సాగింది. తొలుతగా ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం విద్య, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐసీడీఎస్, వైద్యశాఖల ద్వారా అమలుచేసిన కార్యక్రమాలను వివరించారు. వివిధ శాఖల అధికారులు ఆయాశాఖల ప్రగతిని వివరించారు. రిపబ్లిక్‌డే సందర్భంగా ఉత్తమ పురస్కారాన్ని అందు కున్న తహశీల్దారు కేజే ప్రకాష్‌బాబును ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. వైస్ ఎంపీపీలు జి.సుబ్రహ్మణ్యం, కొవ్వూరి అమ్మిరెడ్డి, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

రామచంద్రపురం,జనవరి 27: ఈనెల29నుంచి 31వరకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి వినియోగదా రుల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తుందని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఈఈ వై.విజయానంద్ తెలిపారు. విశాఖపట్టణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో ప్రజాభిప్రాయం సేకరిస్తుంది. పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

జేవీఎల్‌కు ఇంటర్నేషనల్ ఐకన్ అవార్డు

ముమ్మిడివరం, జనవరి 27: రాణేలంకమొల్లికి చెందిన ఎల్బా ఇంటర్నేషనల్ కన్వీనర్ జేవీఎల్ నరసింహారావు ఇంటర్నేషనల్ ఐకన్ అవార్డును ఎస్పీ శ్రీధర్ నుంచి అందుకున్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం

కె.గంగవరం, జనవరి 27: బీజేపీ కోనసీమ జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశం కోటిపల్లిలో జిల్లా అధ్యక్షుడు దొరబాబు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరాజు, అనకాపల్లి ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతు సమస్యలపై ఏవిధంగా పోరాటాలు చేయాలనే అంశాలను చర్చించారు. సమావేశంలో టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన గుర్రాల సత్యనారాయణను సన్మానించారు.

నేడు కేంద్ర మంత్రి నారాయణస్వామి రాక

పి.గన్నవరం, జనవరి 27: కేంద్ర సామాజిక న్యాయ సహాయ మంత్రి అబ్బయ్యనారాయణస్వామి ఆదివారం పి.గన్నవరంలో పర్యటిస్తారని ఆర్డీవో ఎం.ముక్కంటి తెలిపారు. పోతవరం పెట్రోలుబంకు సమీపంలో లేఅవుట్‌లో ఆదివారం జరగనున్న హాలో మాదిగ చలో గన్నవరంలో బహిరంగసభలో మంత్రి పాల్గొంటారు. వై.వి.పాలెం వద్ద పశ్చిమగోదావరి జిల్లా గ్రామాల ప్రజలు నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తారు. సభ నిర్వాహకులు ఆకుమర్తి చిన్నా, స్థానికులతో కలిసి ఆర్డీవో ఏర్పాట్లు పరిశీలించారు.

గ్రామస్తుల హామీతో దీక్ష విరమణ

ఆలమూరు, జనవరి 27: జొన్నాడ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవికి బదులుగా పార్వతిపేరుతో అర్చనలు చేయడాన్ని నిరసిస్తూ గ్రామానికి చెందిన ద్విభాష్యం శ్రీనివాస్ చేపట్టిన అమరణ దీక్ష శనివారం విరమించారు. ఆలయం వద్ద ఉమా సమేత మల్లేశ్వరస్వామిగా శిలాఫలాకం ఏర్పాటుచేసి ఆవిధంగా పూజా కార్యక్రమాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ ద్వారంపూడి దొరబాబు, దేవరకొండ సూరిబాబు, చేరుకూరి శ్రీహరి, జనార్ధనం తదితరులు హామీ ఇవ్వడంతో దీక్ష విరమణకు అంగీకరించి నిమ్మరసం తీసుకున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం పంపిణీ

కొత్తపేట, జనవరి 27: కొత్తపేట శివారు చినరాముడినూతి మెరకలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో యనమదల కృష్ణ కుటుంబం పూర్తిగా నష్టపోయింది. శనివారం జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసైనికులు రూ.10వేలు, నిత్యావసరాలు అందించారు. మనం ట్రస్టు ఇన్‌చార్జ్ యెండూరి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు రూ.8వేలు, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో సలాది రామకృష్ణ, పల్లికొండ సుధీర్‌కుమార్, తులా రాజు, కంఠంశెట్టి చంటి, సిద్ధంశెట్టి రాయుడు, మనం ట్రస్టు సభ్యులు గంగుమళ్ళ రాజు, పిక్క ష్మారావు, చొప్పల రాజా, కొత్త సాయికృష్ణ, సిద్దంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: 105
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: కెప్టెన్ మిల్లర్
శేఖర్ స్ర్కీన్-1	: హనుమాన్
శేఖర్ స్ర్కీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: సలార్

బాలబాలాజీ ఆదాయం రూ.2,08,448

మామిడికుదురు, జనవరి 27: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.2,08,448 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ జి.మాధవి తెలిపారు. దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని 3,571మంది భక్తులు దర్శించుకుని, 2,695మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఏసీ మాధవి, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రెడ్డి సుబ్రహ్మణ్యం పరామర్శ

కె.గంగవరం, జనవరి 27: టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పార్టీ నాయకులకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఇటీవల మరణించారు. కూళ్ల గ్రామంలో చిట్టూరి వెంకట్రాయుడు కుటుంబ సభ్యులను, సత్యవాడలో సలాది బుల్లబ్బులు, సలాది సత్తిబాబు, బ్రహ్మపురిలో బాలదాసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు చిట్టూరి సుబ్బారావు చౌదరి, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, సలాది రమేష్ తదితరులు ఉన్నారు.

సార్వత్రిక ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి

అల్లవరం, జనవరి 27: 2024 సార్వత్రిక ఎన్నికల సమరానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని, వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి పినిపే విశ్వరూప్ పిలుపునిచ్చారు. కోడూరుపాడు సత్యకస్తూరి కల్యాణ మండపంలో మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో ఎన్నికలకు సిద్ధం కావాలి సభను నిర్వహించారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో ఏలూరులో త్వరలో జరిగే సిద్ధం సభకు వేలాదిగా తరలిరావాలన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, సాధనాల వెంకట్రావు, యల్లమిల్లి బోస్, మెరికల శ్రీను, పల్లి జేమ్స్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామకృష్ణంరాజు

అమలాపురం టౌన్, జనవరి 27: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన బీహెచ్‌వీ రామకృష్ణంరాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కోనసీమలోని దంత వైద్యులతో పాటు ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన రామకృష్ణంరాజు మాట్లాడుతూ దంత వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అధునాతన వైద్యంపై శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఐడీఏ కార్యదర్శి డాక్టర్ డి.సత్యసునీల్, డాక్టర్ జి.గణపతి పాల్గొన్నారు.

కేసీ చంద్రశేఖర్‌కు ఘన నివాళి

యానాం. జనవరి 27: రీజెన్సీ పరిశ్రమ ఉపాధ్యక్షుడు, విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ కేసీ చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా విద్యాసంస్థలకు చెందిన ప్రతినిధులు, విద్యార్థులు చంద్రశేఖర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక వృద్ధాశ్రమంలో చంద్రశేఖర్ కుమార్తెలు వినీల, జాహ్నవిలు ఆధ్వ ర్యంలో వృద్ధులకు, చిన్నారులకు అన్నదానం చేసి, పండ్లు, స్వీట్లను పంచారు. తొలుత వృద్ధాశ్రమం ప్రాంగణంలో ఉన్న చంద్రశేఖర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రీజెన్సీ పాఠశాల ఆవరణలో చంద్రశేఖర్ చిత్రపటానికి విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టీవీఎస్ఎస్‌వి ప్రసాదరావు, చింతా కొండలరావు, సీహెచ్ వీరభద్రరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహితుల క్రికెట్ పోటీలు

అమలాపురం రూరల్, జనవరి 27: రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహితుల క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రెండో దశ అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి దశలో మూడు రోజుల పాటు ముక్తేశ్వరం జిల్లాపరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఈనెల 27నుంచి 30వరకు కిమ్స్ క్రీడాప్రాంగణంలో లీగ్ దశ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈటోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేద పండితులు, పురోహితులు, అర్చకులతో కలిసి 20 టీములు పాల్గొన్నాయి. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను కర్రా బాబి, ఉపద్రష్ట విజయ్, గండికోట సాయి, ఉపద్రష్ట మహేంద్రం, పోచినపెద్ది అక్షయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

బీజేపీ సమావేశం

మలికిపురం, జనవరి 27: బీజేపీ బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. శనివారం మలికిపురంలో పార్టీ అధ్యక్షుడు కె.కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పల్లెకు పోదాం కార్యక్రమానికి మండల కన్వీనర్‌గా దెందుకూరి రామలింగరాజు, కోకన్వీనర్‌గా అనిశెట్టి బాలాజీని నియమించారు. సమావేశంలో అడబాల రాంబాబు, యిందుకూరి అచ్యుత రామరాజు, కె.తమ్మయ్య, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యార్థులకు ఒలింపియాడ్‌లో బహుమతులు

మలికిపురం, జనవరి 27: ఇ-అబ్యాస్ అకాడమీ ఆంధ్రప్రదేశ్ అపుస్మా శనివారం పాఠశాలలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్‌లో విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు బహుమతులు పొందారు. 7వ తరగతికి చెందిన కె.జశ్వంత్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి, 9వతరగతికి చెందిన ఎన్.కేథలిన్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో వీరికి బహుమతులు అందజేసినట్టు కరస్పాండెంట్ సీవీవీ ప్రసాద్ తెలిపారు.

చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారంపై హర్షం

అంబాజీపేట, జనవరి 27: మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారం రావడంపై పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సెంటర్‌లో చిరంజీవి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చిరంజీవి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, అరి గెల సూరిబాబు, కొర్లపాటి డీల్లి, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, అరిగెల బలరామమూర్తి, కానూరి బాబ్జి, మైలా ఆనందరావు, దొమ్మేటి సత్యమోహన్, సుదాబత్తుల రమేష్, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు

కొత్తపేట, జనవరి 27: మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారం లభించడంపై కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సలాది రామకృష్ణ, పల్లికొండ సుధీర్‌కుమార్, తులా రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు సంఘటితమై రాజ్యాధికారం వైపు పయనించాలి

మామిడికుదురు, జనవరి 27: బీసీలందరూ సంఘటితమై రాజ్యాంగం దిశగా పయనించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ మామిడికుదురు మండలశాఖ సమావేశం అధ్యక్షుడు నయినాల రఘురామ్ అధ్యక్షతన జరిగింది. దేశ జనాభాలో 65శాతం ఉన్న బీసీలకు దామాషాలో రిజర్వేషన్ ఫలాలు అందాలన్నారు. పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.30వేలు విలువైన ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, బొక్కా వెంకటేశ్వరరావు, భూపతి మనోహర్‌రాజు, రాయుడు నాగేశ్వరరావు, కుడుపూడి త్రినాథ్, బాలం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

ఆత్రేయపురం, జనవరి 27: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా కొత్తపేట నియోజకవర్గ స్థాయిలో శనివారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఆత్రేయపురం సచివాలయం -2 ప్రథమ స్థానం సాధించింది. ఈసందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ద్రాక్షారామ, జనవరి 27: ద్రాక్షారామ, హసన్‌బాద గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు శనివారం జరిగాయి.. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రఉపాధ్యక్షులు అయ్యాజీ వేమా మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇళ్ల సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ దూడల శంకర నారాయణ, మండల అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ పాల్గొన్నారు. హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ షెలత్‌రాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయవరం, జనవరి 27: రాయవరం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎస్టీయూ మండల నూతనకార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎస్టీయూ మండలాధ్యక్షుడిగా దేవరకొండ సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శిగా పంపన వీరవెంకటరమణ, ఆర్థిక కార్యదర్శిగా రాయవరపు విజయభాస్కర్, మండల గౌరవాధ్యక్షుడిగా యాకల విశ్వేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా వెలగల భామిరెడ్డి, బండారు శ్రీనివాసరావు,అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లేశ్వరపు రామకృష్ణ ఎన్నికయ్యారు. ఎస్టీయూ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనపర్తి, బిక్కవోలు, కపిలేశ్వరపురం మండలాల ఎస్టీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, జనవరి27: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి సుదర్శన హోమానికి కాకినాడకు చెందిన సహిష్ణు గోవిందదాసు, సర్వలోకేశ్వరిదేవిదాసి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ విజయసారథికి అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందించారు. నరసింహ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు

అంతర్వేది, జనవరి 27: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి రాజోలుకు చెందిన బేతినీడి సూరిబాబు రూ.30వేలు విలువైన కూరగాయలు అందించారు. ఆలయ సూరింటెండెంట్ పి.విజయసారథి, అన్నదానం స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో యువకుడి ఆత్మహత్య

అల్లవరం, జనవరి 27: మద్యానికి బానిసై మానసిక ఒత్తిడితో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన విప్పర్తి వీరవెంకట సత్యనారాయణ(32) ఓడలరేవు- కొమరగిరిపట్నం సముద్రతీరంలో సరుగుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

రామచంద్రపురం, జనవరి 27: నూతనజాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, అందరికి సమాన ప్రమాణాలుగల విద్యసామాజికన్యాయం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లాఅధ్యక్షుడు బి.సిద్దూ అన్నారు. ఫిబ్రవరి8న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. స్థానిక సిద్ధార్థ ఐటీఐ కళాశాలవద్ద చలోఢిల్లీ పోస్టర్‌ను విడుదల చేశారు. పీడీఎస్‌యూ నాయకులు అభిషేక్, బాలాజీ, సూర్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పామర్రులో నేత్ర దానం

కె.గంగవరం, జనవరి27: పామర్రులో శనివారంమరివాడ సర్వేశ్వరరావు (73)అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన కరుటూరి శ్రీవెంకటరత్నం, మరివాడ సూర్యనారాయణ(సూరిబాబు) ప్రోత్సహించడంతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. కాకినాడ ఐబ్యాంకు ప్రతినిధులు నేత్రాలు సేకరించారు. కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.